


బాసర ట్రిపుల్ ఐటీ

వేలాది మంది విద్యార్థుల ఎదురుచూపు

# ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ రాలే

- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- అనుమతి రాగానే నోటిఫికేషన్ విడుదల చేస్తాం : ఏవో రణధీర్

బాసర, ఏప్రిల్ 30 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారి చెంత రాష్ట్రంలోనే ఏకైక ట్రిపుల్ ఐటీ ఉంది. గ్రామీణ పేద విద్యార్థుల కోసం 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడు ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి బాసరలో నిర్మించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గతేడాది కూడా నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేసింది. ఈ విద్యా సంవత్సరం 2025-26కి సంబంధించి ఇప్పటి వరకు ప్రవేశ నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. కనీసం ఈ విషయంలో ప్రభుత్వం పట్టింపు లేకుండా ఉంది. కాగా.. 2025-26 విద్యా సంవత్సరానికి ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కోసం అడ్మిషన్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. గతేడాది ఉన్న అడ్మిషన్ కమిటీని కొనసాగిస్తారా? లేదా కొత్త కమిటీని ఏర్పాటు చేస్తారా? అనే సందిగ్ధం ఉంది.

**విడుదలైన పదో తరగతి ఫలితాలు..**

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పదో తరగతి ఫలితాలను వెలువరించింది. ట్రిపుల్ ఐటీలో నోటిఫికేషన్ విడుదల కాక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్ సందిగ్ధంలో ఉందని, ఇటు ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తే అడ్వాన్స్‌లు కట్టమని అడుగుతున్నారని పేర్కొంటున్నారు. నోటిఫికేషన్ విడుదల కాక తమ పిల్లల చదువులు అయోమయంలో పడ్డాయని, ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు.

**ఈ ఏడాది సీట్ల కొనసాగింపు ఎలా?**

2025-26 విద్యాసంవత్సరానికి 1500ల సీట్లకు ఏ విధంగా భర్తీ చేస్తారోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఈ సంవత్సరం ఫలితాలు సీజీపీఏగా కాకుండా మార్కులను కేటాయించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు అదనంగా 0.4 సీజీపీఏ నిలిపేవారు. అయితే ఇప్పుడు ఏ విధంగా మార్కులు కలుపుతారో? విద్యార్థులకు సీట్లను ఎలా కేటాయిస్తారో? అనే సందిగ్ధంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉన్నారు.

**ప్రభుత్వ అనుమతి రాగానే విడుదల చేస్తాం..**

ఈ ఏడాది నోటిఫికేషన్ విడుదల కోసం ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాం. ప్రభుత్వం అనుమతి రాగానే అడ్మిషన్‌ల ప్రక్రియ నిర్వహిస్తాం. అలాగే ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు సాధించిన మార్కుల పరంగా సీట్లను ఏ విధంగా కేటాయించాలో ప్రభుత్వానికి నివేదిక పంపించాం. దీనిపై అనుమతులు రాగానే అతి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తాం.
- ఏవో రణధీర్



రాష్ట్రస్థాయిలో ఆదిలాబాద్ జిల్లా 9వ స్థానం



# బాలికలే టాప్

- 97.40 శాతం ఉత్తీర్ణత
- జూన్ 3 నుంచి పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఎదులాపురం, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఆదిలాబాద్ జిల్లా 9వ స్థానంలో నిలిచింది. గతేడాది కంటే ఈసారి 4.47 శాతం ఉత్తీర్ణత శాతం పెరిగింది. 97.40 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గతేడాది 17వ స్థానంలో నిలువగా, ఈసారి 8 స్థానాలు మెరుగుపర్చుకుని రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో నిలించింది. ఈ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. జిల్లాలో 65 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈసారి ఫలితాలు గ్రేడింగ్‌లో కాకుండా మార్కుల రూపంలో ఇచ్చారు.

**మెరుగుపడిన ఫలితాలు**

జిల్లా విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించారు. గతేడాది 19వ స్థానంలో ఉండగా, ఈసారి 9వ స్థానం



కైవసం చేసుకుంది. జిల్లాలో మొత్తం 10,028 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 9,767 మంది ఉత్తీర్ణత సాధించారు. 97.40 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 5,049 మంది పరీక్షకు హాజరు కాగా, 4,890 మంది ఉత్తీర్ణులయ్యారు. 96.85 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 4,979 మంది పరీక్షలకు హాజరు కాగా, 4,877 మంది పాస్ అయ్యారు. 97.95 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఉత్తీర్ణత శాతం పరంగా మెరుగుపడగా, రాష్ట్రస్థాయిలో టాప్ 10లో నిలిచారు. ఆశ్రమ పాఠశాలల్లో 98.73 శాతం, బీసీ వెల్ఫేర్‌లో 99.69, ప్రభుత్వ యాజమాన్యంలో 87.70, కేజీబీవీల్లో 97.64, మోడల్ స్కూళ్లలో 99.82, ప్రైవేట్ పాఠశాలల్లో 98.76, మినీ రెసిడెన్షియల్‌లో 97.12, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 100 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో 99.76, జెడ్పీ యాజమాన్యంలో 96.02 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

**జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు..**

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పదో తరగతి పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు పక్షం రోజుల గడువు ఉంది. రీ కౌంటింగ్, జవాబు పత్రాల జిరాక్స్ కాపీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, వాటిని డీఈవో కార్యాలయంలో సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రీ కౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ.500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్ష ఫీజు ఈనెల 16 వరకు చెల్లించేందుకు గడువు ఉందని పేర్కొన్నారు.

**నిర్మల్ జిల్లా రాష్ట్రస్థాయిలో 15వ స్థానం**

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రస్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 9,123 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇందులో బాలురు 4,441 మంది ఉండగా.. బాలికలు 4,682 మంది ఉన్నారు. 9,123 మంది విద్యార్థులకు 8,822 (96.70 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. వీటిలో బాలురు 4,261 (95.95 శాతం) మంది.. బాలికలు 4,561 (97.42 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర కంటే బాలికలే అధికంగా ఉత్తీర్ణత సాధించారని డీఈవో రామారావు తెలిపారు.

**కేజీబీవీల్లో..**

నిర్మల్ జిల్లాలో18 కేజీబీవీలు ఉండగా 13 కేజీబీవీలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో 711 మంది పరీక్షకు హాజరు కాగా 701 మంది ఉత్తీర్ణత సాధించినట్లు సెక్టోరియల్ అధికారిణి సలోమి కరుణ తెలిపారు.

# గుప్పుమంటున్న గంజాయి

నిర్మల్, భైంసా కేంద్రాలుగా అమ్మకాలు

- పాన్ షాపులు, కిరాణ దుకాణాలే అడ్డాలు
- మత్తుకు బానిసలవుతున్న యువత
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు
- అంతర పంటగా సాగు

నిర్మల్, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలకే పరిమితమైందని అనుకుంటున్న గంజాయి సరఫరా జిల్లాలు, మండల కేంద్రాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్నది. నిర్మల్ జిల్లాలో గంజాయి దందా జోరుగా సాగుతున్నది. యువతనే టార్గెట్‌గా చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. తాజాగా సోమవారం రోజు నిర్మల్, భైంసా పట్టణాల్లో పట్టుబడిన గంజాయే ఇందుకు నిదర్శనం. గతంలో కూడా పలుమార్లు గంజాయిని జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఒక పక్క ప్రభుత్వం మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామని ప్రగల్భాలు పలుకుతున్నా చాపకింద నీరులా రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. నిర్మల్ జిల్లాకు చుట్టు పక్కల మహారాష్ట్ర సరిహద్దు ఉండడంతో అక్రమ రవాణాకు అడ్డాగా మారుతున్నది. అంతేకాకుండా నిర్మల్ జిల్లా కేంద్రం గుండా 44, 61వ నంబర్ జాతీయ రహదారులు వెళ్తుండడంతో ఆయా రూట్లలో తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డ ఘటనలు ఉన్నాయి. నాసిక్ జిల్లా మాలేగావ్‌కు చెందిన ఓ వ్యక్తి 1,140 గ్రాముల గంజాయితో సోమవారం భైంసాలో పట్టుబడిన విషయం తెలిసిందే. అలాగే నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట్ కాలనీలో ఇద్దరు గంజాయితో పట్టుబడగా, వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ముఖ్యంగా పాన్ షాపులు, కిరాణ దుకాణాలు, బేకరీలు, బస్టాండ్, కళాశాలలకు సమీపాల్లో విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. కొంత కాలంగా గంజాయి విక్రయదారులు ప్రధానంగా యువతను లక్ష్యంగా చేసుకుని దందాను గుట్టుగా సాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో విక్రయదారులే సిగరేట్లలో గంజాయిని నింపి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. అలాగే ప్యాకెట్ల రూపంలో విక్రయాలు సాగిస్తున్నారని తెలుస్తున్నది. ఒక్కో సిగరేట్ రూ.50 నుంచి రూ.100కు, అలాగే ప్యాకెట్ అయితే రూ.100 నుంచి రూ.200ల వరకు విక్రయిస్తున్నారని సమాచారం. ఇలా గంజాయి విక్రయదారులు యువతను గంజాయి మత్తుకు అలవాటు చేస్తూ వారిని బానిసలుగా మారుస్తున్నారు. దీంతో బాధిత యువత తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.




నిర్మల్‌లో పాన్ షాపుల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)

**ప్రత్యేక ఏర్పాట్లతో..**

చాలామంది యువకులు గంజాయిని సిగరేట్లలో నింపుకుని ఓసీబీ స్లిప్‌లో పెట్టి కాలుస్తున్నారని సమాచారం. గంజాయిని చేతిలో వేసుకుని నలిపిన తర్వాత దాన్ని ఓసీబీ స్లిప్‌లో చుట్టి సిగరేట్ తరహాలో కాలుస్తారు. మామూలు కాగితం మంట అంటుకుంటే వేగంగా కాలిపోతుంది. ఈ ఓసీబీ స్లిప్ ప్రత్యేకమైన కాగితం కావడంతో గంజాయిని నింపినప్పుడు సిగరేట్ తరహాలో ఆరిపోకుండా వెలుగుతాయి. అయితే సోమవారం నిర్మల్‌లోని పాన్ షాపుల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించిన సమయంలో కొన్ని చోట్ల ఈ ఓసీబీ కాగితాలను గుర్తించినట్లు తెలిసింది. వాటిని స్వాధీనం చేసుకున్న నిర్మల్ పోలీసులు పాన్‌షాప్ నిర్వాహకులకు గట్టి వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం.

**అంతర పంటగా సాగు**

కొంతమంది రైతులు గంజాయి సాగుతో ఎదురయ్యే ఇబ్బందులను తెలుసుకోకుండా తమ వ్యవసాయ భూముల్లో గంజాయిని అంతర పంటగా సాగు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా అటవీ ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో కొంత మంది రైతులు గంజాయిని సాగు చేస్తున్నట్లు చెబుతున్నారు. మార్కెట్‌లో గంజాయికి భారీగా డిమాండ్ ఉండడంతో తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చన్న ఆశతో వారి జీవితాలనే చిత్తు చేసుకుంటున్నారు. ఇప్పటికైన యువత గంజాయి వంటి మత్తు పదార్థాల భారిన పడకుండా నిరంతరం అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

# ఘనంగా బసవేశ్వర జయంతి

ఎదులాపురం, ఏప్రిల్ 30 : ఆదిలాబాద్ పట్టణంలో బుధవారం బసవేశ్వర చౌక్ వద్ద 892వ బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఇక్కడ కలెక్టర్ రాజర్షి షాతోపాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనన్న భావనను ప్రజల్లోకి తీసుకువెళ్లి సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, జంగమ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి అన్నదానం జగదీశ్వర్, బీసీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్

# వేర్వేరు చోట్ల జొన్న పంట దగ్ధం

తాంసి, ఏప్రిల్ 30 : తాంసిలో సోమ గంగారెడ్డికి చెందిన జొన్న పంట బుధవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. పంట చేను సమీపంలోని విద్యుత్ నియంత్రిక నుంచి మినుగుర్లు రావడంతో ప్రమాదం చోటు చేసుకుంది. 3 ఎకరాల్లో జొన్న పంట వేయగా అందులో 2 ఎకరాలు దగ్ధమైందని రైతు తెలిపారు. ఈ ప్రమాదంలో 30 క్వింటాళ్ల జొన్న పంట నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 30: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం దేగామ గ్రామానికి చెందిన రైతులు కొడారి నరేశ్, అంగ వినోద్, కొత్తకొండ శ్రీకాంత్, లక్ష్మి, రవీందర్, రాజేందర్, నైతం రాజేశ్‌కు చెందిన 10 ఎకరాల జొన్న పంట, 100కు పైగా పైపులు, స్పింకర్లు అగ్నికి ఆహుతైన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం మధ్యాహ్నం జొన్న పంటలో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల రైతులు గమనించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసిన గాలికి చుట్టు ఉన్న భూములలో ఉన్న జొన్న పంటలకు మంటలు వ్యాపించి పూర్తిగా కలిబుడిదైంది. చేతికి వచ్చిన పంట కళ్ల ముందు కాలిపోవడం చూసిన రైతులు రోదించారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్ఐ నూర్‌సింగ్, బోథ్ సీఐ వెంకటేశ్వరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

# రాత్రి 11 దాటితే బయట తిరగొద్దు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- 100 మంది యువకులకు కౌన్సెలింగ్
- తల్లిదండ్రులకు అప్పగింత

ఎదులాపురం, ఏప్రిల్ 30 : పట్టణాల్లో అర్ధరాత్రి అనవసరంగా, అకారణంగా తిరిగే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఆదిలాబాద్ పట్టణంలో గత రాత్రి ఆపరేషన్ చబుత్ర నిర్వహించామని పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలో 11.30 గంటల తర్వాత ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి నేతృత్వంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారన్నారు. అకారణంగా సంచరిస్తున్న 100 మంది యువకులను ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లను తరలించి కౌన్సెలింగ్ నిర్వహించామని, తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. ఆదిలాబాద్ పట్టణ వ్యాపార సమూహాలు 10.30 గంటలకు మూసి వేయాలని, 11 గంటల వరకు ఇళ్లకు చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమ ముఖ్యోద్దేశం అర్ధరాత్రి పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా ప్రశాంత వాతావరణం, నేరాల నియంత్రణ, యువత గొడవలకు దారి తీయకుండా, ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డితో పాటు పట్టణ సీఐలు డి.సునీల్‌కుమార్, సిహెచ్ కరుణాకర్, రూరల్ సీఐ పనిధర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, డి.వెంకటి, టి.మురళి, బి.శ్రీపాల్, ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.


